క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భవానీ శంకరపురం ఎస్సీ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసిందని, త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని రాజ్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ రాజయ్య, సి.మణి, గురవయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న దాత కాంచన

నారాయణవనం: మండలంలోని పాలమంగళం జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థిని కాంచన రూ.1,05,000 అందించినట్లు హెచ్‌ఎం మనోహరి తెలిపారు. నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనంద బాబు సతీమణి కాంచన చిత్తూరు జిల్లా విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్నారని అన్నారు. పాఠశాలలో నిర్మించనున్న షెడ్డు నిర్మాణానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

శ్రీపల్లికొండేశ్వరుని సేవలో ఆర్డీఓ



మాడ వీధులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామిని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు దర్శించుకున్నారు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆలయ పాలకమండలి సభ్యుడు ఆనంద్ పాల్గొన్నారు.

దేవాలయాలకు భూమి పూజ



మందిరాలకు భూమి పూజ నిర్వహిస్తున్న నిర్వాహకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పొయ్యి పంచాయితీ పరిధి గురుకుల పాలెం, కొమ్మనగుంట, తాటిపర్తి పంచాయతీ పరిధిలోని కల్లిపూడి ఎస్సీ కాలనీలలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ సీతా రాములమందిరాలకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ భూమి పూజలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ డైరెక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, వసంతరావు, క్రాంతి కుమార్, సురేష్, మణి, చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన



పశువైద్య శిబిరంలో వెటర్నరీ అధికారులు

రేణిగుంట: మండలంలోని మామండూరు పంచాయతీ బాలపల్లిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ సహకారంతో రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ ఫండ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశుసంవర్ధక శాఖ అధికారి స్రవంతి పశువులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాడి రైతులు జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. పశువులకు పిడుదులకు సంబంధించిన మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

హలీం సెంటర్ ప్రారంభం



హలీం సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

రేణిగుంట: రంజాన్ మాసం ప్రారంభం కావడంతో శుక్రవారం రేణిగుంటలో హైదరాబాది ఇరానీ హలీం సెంటర్‌ను ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వార్డు సభ్యుడు రసూల్ బాషా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా మంచి పోషకాలతో కూడిన హలీంను ప్రతి ఒక్కరూ రుచి చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

వానొస్తే...వాహనం వెళ్లదంతే

- కాపుగున్నేరి, అక్కుర్తి రైల్వే బ్రిడ్జి కింద నిలుస్తున్న వర్షపు నీరు
- రోజుల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం

శ్రీకాళహస్తి రూరల్: చిన్నపాటి వర్షం కురిసినా కాపుగున్నేరి, అక్కుర్తి రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో అటు, ఇటు గ్రామాల్లోకి వెళ్లే ప్రజల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. అత్యవసర సమయాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సి వస్తోంది. ఎనిమిదేళ్ల కిందట మండలంలోని కాపుగున్నేరి, అక్కుర్తి గ్రామాలకు వెళ్లే రహదారిలో రైల్వేశాఖ అండర్ బ్రిడ్జిలు నిర్మించింది. ఈ బ్రిడ్జిలు లోతట్టు ప్రదేశంలో ఉండడంతో వర్షం కురిసిన వెంటనే వర్షపు నీరు నేరుగా అండర్ బ్రిడ్జి కిందకు 5 నుంచి 6 అడుగులు నిలిచిపోతున్నాయి. గత శుక్రవారం నుంచి మండలంలో వర్షాలు కురుస్తుండడంతో వాహనాలు, ప్రజలు వెళ్లటానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఎరువులు కోసం వెళ్లే రైతులు, పాల వ్యాపారులు అండర్ బ్రిడ్జి కింద వెళ్లటానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు.



కాపుగున్నేరి అండర్ బ్రిడ్జికింద నిలిచిపోయిన వర్షపునీరు

దాటలేని పరిస్థితుల్లో సుమారు రెండు కి.మీ. ప్రయాణం చేసి ప్రధాన రహదారిలోకి చేరుకోవాల్సి వస్తోంది. కొంత మంది రైలు పట్టాలు దాటి వెళుతున్నారు. పలుమార్లు ప్రజలు ఆందోళన చేసిన రైల్వే అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపుగున్నేరి అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవటం వలన రైతులు సాగుచేసిన పంటలు నీటమునిగిపోతున్నాయని చెర్లోపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షం వస్తే రాకపోకలు బంద్

చిన్నపాటి వర్షం పడినా అండర్ బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండడంతో అవతలి వైపు ఇటు వైపు వెళ్లే గ్రామాల ప్రజల రాకపోకలు పూర్తిగా బంద్ అవుతున్నాయి. బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. రాత్రి సమయాల్లో తెలియకుండా వాహనదారులు బ్రిడ్జి కిందకు వెళ్లి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ నీటిని తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

– మదన్‌మోహన్, కాపుగున్నేరి

భయంగా ట్రాక్ దాటాలి

వర్షం వచ్చినప్పుడు రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా నిండిపోవటం వలన గ్రామంలో నుంచి పొలాలు దగ్గరకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తోంది. ఎప్పుడు ఏమి జరుగుతందో కూడా తెలియని పరిస్థితి. రైల్వే అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి. లేకుంటే పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– ప్రభాకర్, అక్కుర్తి

నేడు వేలం పాట

నారాయణవనం: నారాయణవనం మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ హక్కులకు శనివారం మధ్యాహ్నం 2:30 గంగలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రభురావు తెలిపారు. దినసరి కూరగాయల మార్కెట్, ఆటో స్టాండ్, టూరిస్ట్ స్టాండ్, జంతువధశాల, వారపుసంత, తాగునీటి మోటార్ల రిపేర్లు, స్టేషనరి సరఫరా, వీధి దీపాల మరమ్మతులు, విడిభాగాల సరఫరాతో పాటు బస్టాండ్ సమీపంలోని పంచాయతీకి చెందిన 6 రూములను ఏడాది పాటు అద్దెకు ఇవ్వడానికి వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనే వారు దరావత్తు సొమ్మును వేలం పాటకు ముందుగా కార్యాలయంలో చెల్లించాలని సూచించారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

రేణిగుంట: మండల కేంద్రంలోని సీఆర్ఎస్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన హౌస్‌కీపింగ్ క్లీనింగ్ సిబ్బందిని అకారణంగా నిలిపివేశారని, అయితే వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఆర్ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవ సహాయంకు శుక్రవారం సీఐటీయూ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి వినతిపత్రాన్ని అందించారు. దాదాపు 15ఏళ్లుగా ఇక్కడ 80మంది మహిళలు పనిచేస్తుండగా, నూతన కాంట్రాక్టర్ వారిలో 30మందిని అర్థాంతరంగా నిలిపేశారన్నారు. విచారించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఎస్వీ హైస్కూల్‌లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు



వేడుకలను ప్రారంభిస్తున్న జేఈవో సదా భార్గవి



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- టీటీడీ జేఈవో సదా భార్గవి
- ఘనంగా 51వ వార్షికోత్సవం

తిరుమల: తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ విద్య అందిస్తున్నట్లు టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జేఈవో మాట్లాడుతూ తిరుమల ఎస్వీ హైస్కూల్ ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడితో ప్రారంభమై ప్రస్తుతం 25 మంది ఉపాధ్యాయులు, 675 మంది విద్యార్థులతో నడుస్తోందన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్వీ ఉన్నత పాఠశాలను సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు సహకారంతో దేశంలోనే అత్యున్నతమైన విద్యాసంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. చెన్నై ఐఐటీ డైరెక్టర్ కామకోటి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం టెక్నాలజీ పరంగా సూపర్ పవర్‌గా అవతరిస్తుందన్నారు. టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నారు. సులోచనా దేవి సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో టీటీడీలోని మరిన్ని విద్యాసంస్థల్లో కూడా శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు హెచ్‌ఎం కృష్ణమూర్తి వార్షిక నివేదక చదివి వినిపించారు. కార్యక్రమంలో రేమండ్స్ వైస్ ప్రెసిడెంట్ సంజీవి సారిన్, సింఘానియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు.



వివిధ రకాల ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

విద్యార్థులు లక్ష్యంతో చదివితేనే గుర్తింపు



శ్రీకాళహస్తి: నగదు బహుమతి అందిస్తున్న జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి



వరదయ్యపాళెం: విద్యార్థులకు ప్యాడ్లను అందజేస్తున్న రియాజ్

శ్రీకాళహస్తి రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని చదివితేనే మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఓబులాయపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు బాలయ్య అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తెలుగు భాషతో పాటు ఆంగ్ల భాష పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పరచుకుంటే రాణించగలరని అన్నారు. గత ఏడాదిలో టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాండురంగారెడ్డి రూ.10,000, కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఓబులాయపల్లి సర్పంచ్ కాపిరెడ్డి పోలిరెడ్డి, రెడ్డిపల్లి సర్పంచ్ వెంపల్ల సురేంద్రయాదవ్, సుబ్రమణ్యంనాయుడు, నాధమునిరెడ్డి, అంబటి బాలయ్య ఒక్కొక్కరు రూ.2,016 నగదు బహుమతి అందజేశారు.

సంతవేలూరు హైస్కూల్ వార్షికోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి, సరస్వతి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మునిసుబ్రమణ్యం మట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ సంస్థ అధ్యక్షుడు రియాజ్ ప్యాడ్లు, పెన్నులను అందజేశారు.

నాగలాపురం ఏఎంసీ చైర్మన్‌గా సునంద



పిచ్చాటూరు: నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడికి చెందిన సునందను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా ఆనంద రెడ్డి, సభ్యులుగా నళిని, వేదవల్లి, పరందామయ్య, జయరాణి, వంశీ క్రిష్ణారెడ్డి, అలగేశన్, షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, గురవమ్మ, బుజ్జి, మోహన్, యువరాజు, మోహన నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతోపాటు, కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీల్లో వనరులు పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

సత్యవేడు: పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవాలని జగనన్న స్వచ్ఛ సంకల్పం జిల్లా రిసోర్సు పర్సన్ జి.రవి కుమార్ అన్నారు. శుక్రవారం సత్యవేడులోని సాలిడ్ వేస్ట్ ప్రోసెసింగ్ కేంద్రంలో నాగలాపురం మండలంలోని నందనం, నాగలాపురం, నారాయణవనం మండలం పరిధిలోని పాలమంగళం సాత్, సముదాయం పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్, వెటర్నరీ, వ్యవసాయ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది . ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తయారవుతున్న సేంద్రియ ఎరువును పూర్తిస్థాయిలో విక్రయించేందుకు సచివాలయ సిబ్బంది చొరవ చూపాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో గ్రీన్ అంబాసిడర్స్‌దే కీలక పాత్ర అని అన్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణలో అవలంబించాల్సిన పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, చిన్నిదొరై, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ముని రవికుమార్, సిచివాలయ కార్యదర్శులు హరీష్, సునిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



శ్రీకాళహస్తి: ర్యాలీ చేస్తున్న వైద్యులు



సత్యవేడు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం క్షయవ్యాధి నివారణపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రసన్న మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, రక్తం పడటం, తరచుగా జ్వరం రావడం, ఛాతిలో నొప్పి రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా నిర్ధారించవచ్చన్నారు. ఈ లక్షణాలు కలిగిన వారు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు తీసుకుని ఆరు నెలల పాటు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. పోషకాహారం కోసం వారి ఖాతాల్లో ప్రభుత్వం రూ.500 నెలకు ఒకసారి జమ చేస్తుందన్నారు. వైద్యులు ఆర్‌సీఎం రెడ్డి, రామకృష్ణయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

రేణిగుంట: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని మండల వైద్యాధికారి ఛత్రప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లతో కూడిన ర్యాలీ బృందం ప్లకార్డులను ప్రదర్శిస్తూ పట్టణ వీధుల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఆయన మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని, గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో, హెచ్ఐవీ రోగులకు ఈ వ్యాధి సులువుగా సంక్రమించే అవకాశాలున్నట్లు తెలిపారు. అయితే క్షయ నివారణకు మందులున్నాయని, పూర్తిగా నయం అవుతున్నారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సుమశ్రీ, డాక్టర్ తేజశ్విని, సీహెచ్‌వో హేమావతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్లు రమేష్, ఎం.గుణశేఖర్ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఏ వయస్సు వారికైన సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. రెండు వారాలకు మించిన దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఆకలి తగ్గడం, చాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం దీని లక్షణాలని వివరించారు. రెండుసార్లు కఫం పరీక్షలు చేయడం ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. రోగులు ఆరు నెలల పాటు మందులు వాడాలని సూచించారు. డాక్టర్లు సురేష్, ప్రతిభ, ఎంపీహెచ్ఈఓ ఎల్వీ రమణ, టీబీ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిని మాధవి మాట్లాడుతూ.. టీబీ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోందని తెలిపారు. మందులను సక్రమంగా వాడితే టీబీ నయం అవుతుందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా గల్ల పరీక్షలు చేస్తారని తెలిపారు. వైద్యులు దివాకర్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి గాయత్రి టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



రేణిగుంట: అవగాహన ర్యాలీ



బుచ్చినాయుడుకండ్రిగలో..



పిచ్చాటూరులో..

పర్యవేక్షణ తప్పనిసరి

సత్యవేడు: సచివాలయ వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తప్పనిసరిగా రోజు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించాలని ఎంపీడీఓ బాలగణేశ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వివరాలను తెలిపారు. ఐదేళ్ల పిల్లల పేర్లు ఆధార్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు పోషక ఆహారం పంపిణీపై ఏఎన్ఎంలు దృష్టి సారించాలని తెలిపారు. సచివాలయాల్లో రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఏఈఓ కె.రవి, సీడీపీఓ దేవకుమారి, డాక్టర్ ఎం.గుణశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూలీల శాతాన్ని పెంచాలి



పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మండలంలోని సీతారాంపేట గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 31 నాటికి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి 100 రోజులు పూర్తి చేయాలన్నారు. కూలీలకు తగినన్ని పనులు కల్పించాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. పనులు కల్పించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు సరిత, కూలీలు పాల్గొన్నారు.